# ముఖచిత్ర సుందరి



యం. నాగమణి

స్టూడెంట్స్ స్ట్రయిక్ పుణ్యమా అని క్లాసులన్నీ కాన్సిల్ అయ్యాయి ఆ రోజు.

స్టాఫ్ రూమ్‌లో ముసురుకున్న కోలాహలాన్ని చూసి క్యూరియాసిటీ ఆపుకోలేక లైబ్రరీకి వెళ్తున్నవాడల్లా ఆ ప్రయత్నం మానుకొని స్టాఫ్ రూమ్‌లోకి అడుగు పెట్టాడు, ఆ సంవత్సరమే క్రొత్తగా ఇంగ్లీషు డిపార్ట్మెంట్‌లో లెక్చరర్‌గా అపాయింట్ అయిన శశాంక టేబిల్ పైన ఒక మాగజైన్. టేబిల్ చుట్టూ బెల్లం చుట్టూ ముసురుకున్న ఈగల్లా కొందరు స్టాఫ్ మెంబర్స్. వాళ్ళ వాలకం చూస్తేనే తెలుస్తోంది ఏదో సెన్సేషనల్ న్యూస్ అని. కుతూహలంగా మాగజైన్ వేపో సారి చూశాడు శశాంక.

చిరునవ్వులు చిందిస్తూ అందంతో మెరిసిపోతున్న ముఖ చిత్రం వేపే చూస్తూ నిట్టూరుస్తూ అంటున్నాడు, హిస్టరీ లెక్చరర్ మాధవ రావు. ''ఎన్ని సంవత్సరాల నాటి మాట! ఈమె.. రాధ.. నాకు బాగా తెలుస్.. కాలేజ్‌లో నా క్లాస్‌మేట్.. భలే ఎట్రాక్టివ్‌గా ఉండేదిలే.. ఫాషన్ పెరేడ్ లో ఫస్టొచ్చింది లయన్స్ క్లబ్బు వాళ్ళొకసారి కండక్ట్ చేసినప్పుడు. అబ్బాయిలు పడి చచ్చే వారనుకోండి. కానీ తను మాత్రం నాపై ఎక్కువ ఇంటరెస్ట్ చూపించేది. కాలేజీ ప్రెసిడెంట్‌ని కాగలిగానంటే ఎక్కువ తన సపోర్టే. ప్రతి కల్చరల్ ప్రోగ్రామ్‌లో మేమిద్దరం ఉండాల్సిందే. క్లాసులెగ్గొట్టేసి ఎన్నెన్ని సిని మాలకు పోయేవాళ్లమో. విశాఖపట్నం బీచ్ లో కూర్చుని ఎన్నెన్ని కబుర్లుచెప్పుకునే వాళ్లమో..ప్చ్.. ఆ రోజులే వేరు సార్...'' అంటూ వాపోయాడు మాధవ రావు.

''మరి పెళ్లి చేసుకోలేక పోయారాసార్... ఇంతలా పాపం దేవదాసులా తెగబాధపడి పోతున్నారు?''అన్నాడు శశాంక నవ్వుతూ.

''ఆ అదెక్కడ కుదురుతుందోయ్? మావాళ్లు ఒప్పుకోవద్దూ? నాలుగుకుటుంబాలకి ఒక్కగానొక్క మగనలుసుని... లక్షలకి వారసుడ్ని... పైగామినిస్టర్ గారి మనమడ్ని... ఏదో ఈజాబ్ ఆంటే ఉరికే తమాషాకు చేస్తున్నాగానీ....'' అంటూ సాగదీసాడు మాధవ రావు షర్టుకాలరు సరిచేసుకోంటూ.. రెండు సంవత్సరాలక్రితం పది లక్షల కట్నంతో వచ్చింది అతని భార్య!


రూమ్‌లో అందరూ అసక్తిగా వింటున్నారు. కెమిస్ట్రీ లెక్చరర్ చక్రవర్తి గొంతు సరి చేసుకొని ఇక తను చెప్పాలనుకొన్నది మొదలు పెట్టాడు. ''ఈ ముఖచిత్రం చూడగానే వెంటనే గుర్తుపట్టేశాను. సార్,...ఒకసారి ఢిల్లీ

నుండి మద్రాసు వరకూ ఇద్దరం కల్సే ప్రయాణం చేశాం. భలే యాక్టివ్ పర్సన్ లేండి... ఎట్రాక్టివ్ కూడా! అసలు ఈ ఫోటోలో కంటే మామూలుగా చూసేవారికి ఇంకా అందంగా ఉంటుంది ఈవిడ. ఏవేవో తిను బండారాలు తెచ్చింది వాళ్ల అన్నయ్య గారింటి నుండి. దారంతా తిండి, కబుర్లు.. మంచి కంపెనీ! మద్రాస్‌లో మోడలింగ్ చేస్తున్నానని చెప్పింది. నేనప్పుడు అక్కడే రీసెర్చి చేస్తూవుండే వాడ్ని. రమ్మని అడ్రస్ కూడా ఇచ్చింది గానీ నేనే వెళ్లలా. ఇలాంటి వ్యవహారాల్లో ఇరుక్కొంటే, పెళ్లి పెటాకులు అయిన వాడ్ని... బాబోయ్ ఇంకే మన్నావుందా!'' అంటూ బిగ్గరగా నవ్వేశాడు చక్రవర్తి. అదేదో పెద్ద జోక్ అన్నట్లు అక్కడున్నవాళ్లంతా పడీపడీ నవ్వగారు.

''మరి ఇందాక ఈవిడ నీకూ తెల్సు అన్నావు కదుటోయ్ ప్రసాద్‌రెడ్డీ?.. చెప్పుచెప్పు.. క్లాసులులేని దానికి ఈరోజు మంచి కాలక్షేపం మాకు!'' అన్నారు హిందీ హెడ్ శాస్త్రిగారు కళ్ల జోడు సరిచేసుకొంటూ, కుతూహలంగా.. మరో సంవత్సరానికి రిటైర్ అవబోతున్నా అబ్బాయిలు అమ్మాయిల కబుర్లంటే చెప్ప లేనంత ఆసక్తి ఆయనికి! శశాంక నవ్వాపుకుంటూ ప్రసాద్‌రెడ్డి వేపు చూసాడు, ఇద్దరు లేడీ స్టాఫ్ మెంబర్స్ కాస్తంత దూరంలో కూర్చున్నా చెవులు రిక్కించి వింటున్నారు అక్కడ సంభాషణని. ప్రసాద్‌రెడ్డి కాస్తంత ఇబ్బందిగా కదిలాడు. అందరూ తనవైపే చూస్తుంటే అతనికి చెప్పలేనంత సెల్ఫ్ కాన్షస్‌గా ఉంది!

''మొత్తానికి వీళ్ళిద్దరూ చెప్పేది వింటూంటే భలే ఆశ్చర్యంగా ఉంది సార్. ఈమె నాకు కూడా తెల్సు. ఎలాగంటారా?! లాస్ట్ సమ్మర్ వెకేషన్స్‌లో కొడైకెనాల్ వెళ్ళాం. రెండు వారాలున్నాం అక్కడ. అప్పుడు పరిచయం అయింది ఈమె. ఫ్రెండ్స్‌తో వచ్చిందిట. మేం ఉండే గెస్ట్ హవుస్‌లోనే ఉండేవాళ్ళు. భలే ఇంటరెస్టింగ్ పర్సనాలిటీ లెండి! లేక్ చుట్టూ మైళ్ళు దూరం నడిచేవాళ్ళం రోజూ. బోట్ షికారుకీ, హార్స్ రైడింగ్‌కీ ఎక్కడికెళ్ళినా కలిసే వెళ్ళేవాళ్ళం. అలా గడచిపోయాయా రోజులు. ఆ తరువాత, ఎవరి దారి వాళ్ళదే. అవుట్ ఆఫ్ సైట్ అవుట్ ఆఫ్ మైండ్. మళ్ళీ ఇప్పుడిలా ముఖ చిత్ర రూపంలో చూస్తున్నా ఈమెని.'' అన్నాడు ప్రసాదరెడ్డి మాగజైన్ వేపు చూస్తూ.

''అబ్బే. ఇదేం బాగా లేదయ్యా ప్రసాదరెడ్డి. ఆ పరిచయం అంతటితో ముగించకుండా పెళ్ళి వరకు లాగితే బాగుండేది. పెళ్ళి కావల్సిన బ్రహ్మచారివి. ఇంత అందమైన పిల్లనెవరన్నా చేజార్చుకుంటారుటయ్యా?'' అంటూ మందలించారు శాస్త్రిగారు గట్టిగా నవ్వేస్తూ. మళ్ళీ అందరూ ఆ నవ్వులో శృతి కలిపారు.



'నాట్యరాణి' జి. శైలజ

1985లో వనపర్తిలో ఆకాశవాణి హైదరాబాద్ వారిచే నిర్వహింపబడిన కార్యక్రమంలో 'జానపద నృత్యం' చేసిన శైలజ 1987 అక్టోబర్లో కర్నూల్లో నిర్వహించబడిన నాట్యపోటీలలో పాల్గొని (జూనియర్ విభాగంలో) ప్రథమస్థానాన్ని పొందడమే కాక 'నాట్యరాణి' బిరుదు ప్రదానం, నూరు రూపాయల నగదు, షీల్డు బహూకరణతో సన్మానింపబడింది.

ప్రస్తుతం వనపర్తిలోవుంటూ ఇంటర్ చదువుతున్న ఈ అమ్మాయి కళాశాలల్లో, పాఠశాలల్లో, పరిసర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలివ్వడమే కాక, 1989 మే నెలలో కూచిపూడిలో నిర్వహించబడిన రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతినందుకొంది. అలాగే 'గిరిజా కళ్యాణం'లో పార్వతి పాత్రను ధరించి పలువురి ప్రశంసలందుకొంది. శైలజ 1990 మే నెలలో నాగార్జునసాగర్ కళాసమితివారిచే నిర్వహింపబడిన రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్యపోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి 1990 సెప్టెంబర్ నెలలో కడపలోని 'కళా నిలయం' వారిచే ఏర్పాటుచేయబడ్డ రాష్ట్రస్థాయి కూచిపూడి నాట్యపోటీలో ప్రథమ స్థానంపొంది షీల్డులని అందుకొంది.

—వి. సువర్చలా రాణి

మాగజైన్ చేతిలోకి తీసుకుని ఎంతో పరీక్షగా చూస్తున్న కామర్స్ ప్రొఫెసర్ శ్యామలరావు గార్ని ప్రశ్నించాడు శశాంక. ''ఏం సార్. అంత దీక్షగా చూస్తున్నారు? మీక్కూడా తెలుసా ఈ అమ్మాయి?''

అందరి దృష్టి శ్యామలరావుపై పడింది.

''అదే. ఆశ్చర్యం గా ఉంది శశాంకా ...ఈ అమ్మాయిని ఎక్కడ చూశానా అని బుర్ర బద్దలు చేసుకుని అలోచిస్తే ఇప్పుడు గుర్తొస్తోంది. నేనిక్కడికి రాక ముందు విజయవాడలో ఉండేవాళ్లు వీళ్లు..అప్పుడు చిన్న పిల్ల ఈ పిల్ల.. కానీ అవే కళ్లు.. అదే ముఖం తీరు.. ఏం మార్పు లేదనుకో...మాధవరావు అన్నట్లు ఒకవేళ కాలేజీ చదువులకి వచ్చే సరికి విశాఖపట్నం వెళ్లిపోయారేమో వాళ్లు. కానీ స్కూలు లో చదివే రోజుల్లో మా ఇంటి ప్రక్కనే ఉండే వాళ్లు. భలే అల్లరి గడుగ్గాయిలే! అంకుల్, ఆంటీ అంటూ మా ఇంటికి తరుచుగా వస్తూ ఉండేది..'' అన్నారు శ్యామల రావు చుట్టూ చూస్తూ శ్రోతలను ఉద్దేశించి.

''మొత్తానికి భలే ఆశ్చర్యంగా ఉంది సార్. మన నలుగురికీ ఈమె నాలుగు రకాల సమయాల్లో, కాలాల్లో, నాలుగు రకాల ప్రదేశాల్లో తారసపడ్డం చాలా విచిత్రం కదూ!'' అన్నాడు మాధవరావు ముఖం నిండా ఆశ్చర్యం నింపుకుని.

నోళ్ళు వెళ్ళబెట్టుకుని తమనే చూస్తున్న శ్రోతల వేపు సినిమా హీరోల్లా చూశారు మాధవరావు, చక్రవర్తి, ప్రసాదరెడ్డి, శ్యామలరావున్నూ. ఆఖరికి ఏదో పని మీద అటుగా వచ్చిన ప్రిన్సిపాల్ కూడా ఆసక్తి చూపించారు అలాంటి వింత సంఘటనకు. ''మొత్తానికి ఈ ముఖ చిత్రం కనీవినీ ఎరుగనంత సెన్సేషన్ క్రియేట్ చేసింది గదయ్యా'' అన్నారాయన నలుగురి వేపు ఆసక్తికరంగా చూస్తూ.

''ఆగండాగండి సార్! మరో సెన్సేషనల్ న్యూస్!'' అన్నాడు శశాంక వచ్చే నవ్వు బలవంతాన ఆపుకుంటూ. అందరూ శశాంక వేపు చూశారు కుతూహలంగా.

''ఏమయ్యా. ఈవిడ నీకూ తెల్సా ఏమిటి కొంపదీసి?!'' అన్నారు అక్కడి శ్రోతలలో ఒకరు.

''తెల్సా ఏమిటి? మాగజైనుకి ఈ ఫోటో నేనేగా పంపింది! అరే! అదేమిటలా అందరూ విచిత్రంగా చూస్తున్నారు?! ఇంకా షాకింగ్ న్యూస్ వినండి మరి! ఈ ముఖ చిత్ర సుందరి నా మేనమామ కూతురు. నాకు కాబోయే భార్య. కాకపోతే ఒక పాయింటు మాత్రం నములుడు పడ్డంలా. పుట్టి పెరిగాక ఇంతవరకు రాజమండ్రి ఊరి పొలిమేరలు దాటని మా శృతి మీ నలుగురికి ఎలా పరిచయం అయిందా అని!!'' అంటూ గల గలా నవ్వుతూ, కులాసాగా ఈలవేసుకుంటూ అక్కడి నుండి వెళ్ళి పోయాడు శశాంక, ఆ రూమ్‌లో నల్లగా మాడి పోయిన నలుగురి ముఖాల్ని ఊహించుకుంటూ!!